

సర్వం సిద్ధం
పాలమూరు యూనివర్సిటీలో టీజీపీఈ సెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు.
వివరాలు 8లో ▸



'ఎండీసీఏ'ను అభివృద్ధి చేస్తాం
ఎండీసీఏ మైదానాన్ని అభివృద్ధి చేస్తామని హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /20.9

వాతావరణం
ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో పీజీ 3వ సెమిస్టర్, ఎంసీఏ, ఎంబీఏ పరీక్ష ఫలితాలను పీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్ మంగళవారం విడుదల చేశారు. మొత్తం 84.83శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.ప్రవీణ పేర్కొన్నారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవాలని, ఏమైనా సందేహాలుంటే త్వరలో రీకౌంటింగ్‌కు నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కోఆర్డినేటర్ డాక్టర్ అరుంధతి, డాక్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీకే రెడ్డికాలనీలోని 'నవరత్నాలు' కేంద్రంలో మూడు నెలలుగా కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గంవర్క్ కోర్సులలో రెండో బ్యాచ్ అభ్యర్థులు ఉచిత నైపుణ్య శిక్షణ పొందారు. వీరికి సెట్విన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా, ఇక్కడి ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, 'మహబూబ్‌నగర్ ఫస్ట్ – నవరత్నాలు' పర్యవేక్షకులు గుండా మనోహర్, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, నిజలింగప్ప, అనిల్, సెట్విన్ కో–ఆర్డినేటర్ విజయకుమార్ పాల్గొన్నారు.

4 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు: జిల్లా ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రామ్ కింద 4 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ కృష్ణ తెలిపారు. ఖాళీ పోస్టులలో వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ మేనేజర్, బయో మెడికల్ ఇంజినీర్, బస్తీ దవాఖానాలో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్, ఒక స్టాఫ్ నర్సు పోస్టులను ఏడాది పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రేపు 'ఎస్సీ, ఎస్టీ కమిషన్' పర్యటన

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, శంకర్, ప్రవీణ్‌లు 12వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ విజయేందిర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో వారు భూ, అత్యాచార సమస్యలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు డీసీసీ బ్యాంక్ సమీక్ష నిర్వహించి, 4.30 గంటలకు పోలేపల్లి సెజ్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు.

క్రీడాసంఘాలు వివరాలు అందజేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని గుర్తింపు క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సంఘాల వివరాలను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘానికి నివేదించాలని అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. నియమాలకు సంబంధించి జిల్లా క్రీడాసంఘం రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం చేసిన ప్రతి, తమ క్రీడా రాష్ట్ర సంఘం నుంచి గుర్తింపు పత్రం, క్రీడాసంఘం చివరగా ఏ సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించారో, సర్వసభ్య సమావేశం జరిగిన తేదీ, సభ్యుల వివరాలతో వచ్చేనెల 30వ తేదీ లోపు సమర్పించి జిల్లా యువజన, క్రీడల అధికారి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ క్రీడా సంఘంలో సంఘాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

- పాలమూరులో నిరుపయోగంగా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు
- కొత్త కేంద్రాల ఏర్పాటుపైనా అధికారుల నిర్లక్ష్య వైఖరి
- పుష్కలంగా నీటి వనరులున్నా నిష్ప్రయోజనం
- క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నష్టపోతున్న మత్స్యకారులు



● 'మీన'మేషాలు

నీలినీడలు

మత్స్యకారులకు ఉచితంగా చేప విత్తనాలు ఆర్థిక భరోసా అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందు కోసం ఏటా రూ.కోట్లు వెచ్చించి.. చేప విత్తనాలు అందిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఇది పెద్దగా సత్ఫలితాలు సాధించలేకపోతోంది. దీనికోసం ఉమ్మడి పాలమూరులో ఇప్పటికే అందుబాటులో ఉన్న చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రాలకు కొద్దిపాటి నిధులు వెచ్చించి.. వాటిని వినియోగంలోకి తెస్తే ప్రభుత్వం ఆశించిన నీలి విప్లవం సృష్టించవచ్చు. వీటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు 'మీన'మేషాలు లెక్కిస్తున్నారు.



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిఏటా జిల్లాల వారీగా కోట్లలో చేప విత్తనాలు అవసరమవుతాయి. జిల్లాల వారీగా చేప పిల్లల ఉత్పత్తి జరిగితే వాటిని మత్స్యకారులకు పంపిణీ చేసి పారదర్శకంగా మత్స్య పారిశ్రామిక రంగం వృద్ధి సాధించే అవకాశం ఉంటుంది. అయితే గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఉచిత చేపపిల్లల పంపిణీకి ఉత్పత్తి లేకపోవడంతో మత్స్యకారులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. మత్స్య సంపద పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి పెట్టడం లేదు. దీంతో ప్రతి సంవత్సరం టెండర్లు నిర్వహించి ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి చేప విత్తనాలను తెస్తే నాణ్యత లేకపోవడంతో మత్స్యకారులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నదులు, జలాశయాలు, చెరువులు, కుంటలు మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తున్నాయి. ఉమ్మడి పాలమూరులో 4,624 చెరువులు, కుంటలు, జలాశయాల్లో ప్రతి ఏడాది 11.07 కోట్ల చేపపిల్లల పెంపకం లక్ష్యంగా ఉంది. చేపపిల్లల పంపిణీ కోసం ఏటా రూ.9 కోట్లు వెచ్చిస్తున్నారు. చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తే ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గడంతో పాటు మత్స్యకారులకు నాణ్యమైన చేప విత్తనాలు లభించడంతోపాటు అక్రమాలకు ఆస్కారం ఉండదు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	జలవనరులు	గ.చే.వి.పం.ల.(కో.)
నాగర్‌కర్నూల్	1,448	3.05
వనపర్తి	1,059	2.50
మహబూబ్‌నగర్	1,092	1.92
నారాయణపేట	650	1.82
జోగుళాంబ గద్వాల	375	1.78

గ.చే.వి.పం.ల.(కో.): గతేడాది చేప విత్తనాల పంపిణీ లక్ష్యం (కోట్లలో)



పిల్లలమర్రిలో నిరుపయోగంగా ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం



తీవ్రంగా నష్టపోతున్నారు..

ప్రభుత్వం ప్రతి సంవత్సరం టెండర్లు నిర్వహించి ఇతర ప్రాంతాల నుంచి చేపపిల్లలను తెప్పించి ఇక్కడి మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేస్తుంది. దీంతో చేపపిల్లలు నాణ్యతగా లేకపోవడం, సరైన మోతాదులో పంపిణీ చేయకపోవడం, చేపపిల్లల నిర్ణీత సైజు లేక మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసి స్థానిక మత్స్యకారులకు పంపిణీ చేయాలి. అక్రమాలను నివారించాలి.

– లక్ష్మయ్య, అమ్మాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం..

ఉమ్మడి పాలమూరులోని జిల్లాల వారీగా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాల అవసరం చాలా ఉంది. ప్రస్తుతానికి కోయిల్‌సాగర్‌లో మాత్రమే చేపల ఉత్పత్తి జరుగుతోంది. జూరాల ప్రాజెక్టు వద్ద చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి, వనపర్తి

ఉత్పత్తి కేంద్రాల పరిస్థితిలా..

■ మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నా నిరుపయోగంగా మారాయి. పిల్లలమర్రిలోని చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం కేవలం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన చేపపిల్లలను ఇక్కడ నిల్వ చేసి మత్స్యకారులకు పంపిణీ చేస్తున్నారు. దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ వద్ద కోటి చేపపిల్లలను ఉత్పత్తి చేసేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేసినా అందులో 60 లక్షలు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడ పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరిగితే మత్స్యకాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కేంద్రానికి మరమ్మతు చేపడితే మరింతగా చేపపిల్లల ఉత్పత్తి జరిగే అవకాశముంది.

■ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని ఇంద్రసాగర్‌లో 14 లక్షల సామర్థ్యంతో చేపపిల్లల పెంపు కేంద్రం ఉన్నా అది నిరుపయోగంగా మారింది. ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లిలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం మూతబడి పదేళ్లు గడుస్తోంది. దీన్ని ఉపయోగంలోకి తీసుకొస్తే జిల్లాలో చేపపిల్లల పంపిణీకి ఎంతో సౌకర్యవంతంగా మారనుంది.

■ వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని సరళాసాగర్ వద్ద చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఆరేళ్ల క్రితం రూ.10 లక్షలు వెచ్చించి పునరుద్ధరించారు. తర్వాత పెబ్బేరు ఫిషరీస్ కాలేజీ విద్యార్థుల అవగాహన కోసం 20 వేల చేపపిల్లలను ఇక్కడ పెంచుతున్నారు. జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలో 20 ఎకరాల్లో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలోని జములమ్మ రిజర్వాయర్ వద్ద 15 ఏళ్ల క్రితం చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం నిర్మించారు. కొంతకాలం తర్వాత ఇది నిరుపయోగంగా మారడంతో వాటిని తొలగించి ఆలయ అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

జడ్చర్ల: మహిళా పోలీసులు విధుల నిర్వహణలో మరింత చిత్తశుద్ధి, నిబద్ధత కనబరిచి అంకితభావంతో పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ జానకి పిలుపునిచ్చారు. మంగళవారం జడ్చర్ల శివారులోని పోలీసు శిక్షణకేంద్రంలో మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో ఆమె ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీసుశాఖలో విధులు, బాధ్యతలు, ప్రవర్తన నియమావళి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. శిక్షణ దశ నుంచే ఉత్తమ సేవ ధ్యేయంతో ముందుకు సాగాలన్నారు. ప్రజలకు న్యాయం అందించాలన్న లక్ష్యంతో బాధ్యతగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఎక్కడా ఆరోపణలకు, విమర్శలకు తావివ్వకుండా పారదర్శకంగా బాధితుల తరఫున నిలబడాలని సూచించారు. మహిళా సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిబాబు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్ఐ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- నాగర్‌కర్నూల్‌లో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సాక్షి, నాగర్‌కర్నూల్: రానున్న రోజుల్లో రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలన చూశామని, వీరి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని చెప్పారు. విశ్వగురువుగా మోదీ పాలన ప్రపంచవ్యాప్తం అయిందని, రాష్ట్రంలోనూ బీజేపీ పాలనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 11 ఏళ్ల మోదీ పాలనలో చేసిన పనులను ప్రజలకు కులంకశంగా వివరించనున్నట్టు తెలిపారు. మోదీ పాలనలో దేశంలోని 21 కోట్ల ప్రజలను పేదరికం నుంచి విముక్తి కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రపంచ బ్యాంకు నివేదికలోనే స్పష్టం చేసిందన్నారు. 11 ఏళ్ల కిందట ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో పదో స్థానంలో ఉన్న భారత్ నేడు నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా విధానంతో 95 శాతం ఆర్మీ సామగ్రి దేశంలోనే తయారవుతోందని వివరించారు. పహల్గాంలో దాడి చేసిన ఉగ్రమూకలకు సరైన సమయంలో భారత్ గట్టి గుణపాఠం చెప్పిందన్నారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడి ఘటనను పాక్ ప్రధానే ఒప్పుకున్నా.. ఇక్కడి ప్రతిపక్ష నాయకులకు మాత్రం కనిపించకపోవడం విడ్డూరమన్నారు. గత ఏడాదిన్నర పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. మాజీ మంత్రి రాములు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, ఆచారి, భరత్‌ప్రసాద్, ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే పనులు పూర్తి చేయాలని ఎంపీ వినతి



పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులపై మంగళవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఢిల్లీలో ఎంపీ డీకే అరుణ వినతి పత్రం అందించారు. కృష్ణా–వికారాబాద్ రైల్వే లైన్ ప్రాజెక్ట్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. ఈ ప్రాజెక్టు వల్ల హుబ్లీతో పాటు ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ మరింత సులభతరం అవుతుందన్నారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణ పనులపై గతంలో ఇచ్చిన ప్రతిపాదనలు పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,256

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లిమార్కెట్‌కు మంగళవారం మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,256, కనిష్టంగా రూ.1,301 ధరలు లభించాయి. ఆముదాలు గరిష్టంగా రూ.6,257, కనిష్టంగా రూ.6,247, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,838, కనిష్టంగా రూ.1,621, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,209, కనిష్టంగా రూ.1,605 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం గరిష్టంగా రూ.2,100 ఒకే ధర లభించింది. ఏరువాక పౌర్ణమి సందర్భంగా దేవరకద్ర మార్కెట్‌కు బుధవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

నేడు, రేపు ప్రత్యేక డ్రైవ్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర , చిత్రంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా అధికారులు

- బాల కార్మికులకు పునరావాసం కల్పించాలి
- కలెక్టర్ విజయేందిర బోయి


జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈ నెల 11, 12 తేదీల్లో బాలకార్మికులను గుర్తించి పునరావాసం కల్పించేందుకు కార్మికశాఖ, పోలీస్ సంబంధిత శాఖలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో బాలకార్మికులు, కౌమార దశ బాల కార్మికులపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పోలీస్, కార్మిక శాఖ, బాలల సంరక్షణాధికారి, ఎన్జీఓలు ఇతర శాఖలతో మూడు బృందాలు ఏర్పాటు చేసి బాల కార్మికులను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో 14 ఏళ్ల లోపు బాల కార్మికులు, 14–18 ఏళ్ల వయసు ఉన్న కౌమార దశ బాలలు హాట్ స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరిశ్రమలు, పారిశ్రామిక యూనిట్లు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, హోటళ్లలో వలస కుటుంబాలకు చెందిన బాలకార్మికులు ఎక్కువగా పనిచేస్తుంటారని, సంబంధిత యజమానులపై బాల, కౌమార బాల కార్మికుల చట్టం ప్రకారం వివిధ సెక్షన్ల కింద రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించవచ్చని తెలిపారు. బాల కార్మికులను రక్షించి స్టేట్ హోంలో అప్పగించి వారికి కౌన్సెలింగ్ విద్య, వైద్య సదుపాయాలు అందించాలని ఆదేశించారు. వలస కుటుంబాలు పని చేస్తున్న ప్రదేశాలలో వారి పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం అందించాలని సూచించారు. 1098 చైల్డ్ లైన్‌కు కూడా సమాచారం అందించాలన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, డీపీఓ వెంకటేశ్, పరిశ్రమల శాఖ జీఎం ప్రతాప్, డీఈఓ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఇందిర సౌర గిరి జల వికాసం' అమలుకు చర్యలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం జిల్లాలో పకడ్బందీ అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలు ప్రకారం సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ట్రైబల్ వెల్ఫేర్, అటవీశాఖ, గ్రౌండ్‌వాటర్, హార్టికల్చర్, అగ్రికల్చర్, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యుత్, రెడ్కో, ఐటీడీఏ, రెవెన్యూ, సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం అందేలా అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి వారి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను జూన్ 16 లోగా జిల్లా స్థాయి కమిటీకి సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ, నవాబుపేట, మూసాపేట మండలంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూమి కలిగిన గిరిజన రైతులను గుర్తించినట్లు తెలిపారు. మండల కమిటీ ప్రతిపాదనలు తర్వాత జిల్లాస్థాయి అమలు, కొనుగోలు కమిటీలో చర్చించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీపీఓ పార్థసారథి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్, ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, మిషన్ భగీరథ ఈఈ పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

6 రోజుల్లో 29 దరఖాస్తులు

- స్వీకరణకు నేటితో ముగియనున్న గడువు
- కొనసాగుతున్న డివిజన్ల విభజన ప్రక్రియ



కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల విభజన ముసాయిదా ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కాగా, ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరాల దరఖాస్తుల స్వీకరణకు గడువు బుధవారంతో ముగియనుంది. ఈ నెల 5 నుంచి ఇప్పటి వరకు 29 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు మరిన్ని వచ్చే అవకాశం ఉంది. ఇక క్షేత్రస్థాయిలో ఆయా డివిజన్ల సరిహద్దులను నక్షాలతో సరిచూసుకుంటున్న ప్రత్యేక బృందం తాజాగా 33 నుంచి 42వ డివిజన్ వరకు వెళ్లొచ్చింది. ఎక్కడికక్కడే టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది కలిసి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మరో వైపు కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బంది కలిసి సవరించిన ఓటరు జాబితాను ముందుంచుకున్నారు. కొత్తగా ప్రతిపాదించిన డివిజన్ల పరిధిలో ఇంటి నంబర్ల ప్రకారం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఓటర్లు ఉన్నారో పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా వారి పేర్లను పోలింగ్ కేంద్రం వారీగా విభజిస్తున్నారు.

■ పాత 24వ వార్డును తాజాగా 54వ డివిజన్‌గా మారుస్తున్నందున రామయ్యబౌలి పేరును కొనసాగించాలని, పాత వీధులను అందులోనే ఉంచాలని ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు వేర్వేరుగా కోరారు. మరో వైపు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా కొత్త డివిజన్ల ముసాయిదాలోని కొన్ని వీధులను అటు, ఇటు మార్పు చేయాలని విన్నవించడం గమనార్హం.

పారదర్శకంగా చేపట్టాలి: బీజేపీ

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల విభజన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర రహదారులతో పాటు రైల్వేలైన్ విభజించకుండా అంతర్గత ప్రధాన రోడ్లను ఆధారంగా చేసుకొని జరగాలన్నారు. ముఖ్యంగా ఏ డివిజన్‌లో ఉన్న ఓటర్లు అదే డివిజన్‌లో వచ్చేలా చూడాలన్నారు. గతంలో ఓటరు ఒక వార్డులో ఉంటే ఓటు మాత్రం వివిధ చోట్ల ఉండేదన్నారు. ఇప్పుడు అలా జరగకుండా, ఎవరి ఒత్తిడి, ప్రమేయం లేకుండా విభజించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు పద్మజారెడ్డి, మాజీ కౌన్సిలర్లు రామాంజనేయులు, ఎ.అంజయ్య, జిల్లా నాయకులు నారాయణ, దర్పల్లి హరికృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్మికుల హక్కుల సాధన కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో మంగళవారం ఐఎన్‌టీయూసీ జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డాక్టర్ సంజీవరెడ్డి నాయకత్వంలో ఐఎన్‌టీయూసీ అంచలంచెలుగా ఎదిగి ఈ రోజు పెద్ద సంఘంగా ఏర్పడినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సెక్టార్లలో, అసంఘటితరంగ సెక్టర్లలో, బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ రంగాలతోపాటు అనేక ఫ్యాక్టరీలలో అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసుకొని బలమైన సంఘంగా మారిందన్నారు. అనంతరం జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములుయాదవ్, ఉపాధ్యక్షులుగా కావలి శ్రీనయ్య, దమ్మాయిపల్లి శ్రీనివాసులు, ఎండీ అలీం, రాంనాయక్, హాజీ, బలరాం, ప్రధాన కార్యదర్శిగా రాంమోహన్, కోశాధికారిగా విజయబాబు, ప్రచార కార్యదర్శిగా శర్వ లింగం, సలహాదారులుగా ఎస్.సాయిరెడ్డి, కొండ పురుషోత్తం, సహాయ కార్యదర్శులుగా సాయిబాబా, టి.నర్సింలు, బాబుమియాలను ఎన్నుకున్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీకి సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర నాయకులు వి.భాస్కర్‌రెడ్డి, బోరింగ్ శ్రీనివాసులు, బాలయ్య, పర్వతాలు, లక్ష్మణ్‌తోపాటు జిల్లా నాయకులు ఆవిష్కరించారు.

క్లుప్తంగా

బావిలో పడి మహిళ మృతి


చిన్నమ్మ(ఫైల్)

బల్మూర్: బావిలో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని బాణాలలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ రాజేందర్, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఇమ్మడి చిన్నమ్మ (45) మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండేది. రెండ్రోజులుగా కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు వెదుగుతుండగా సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని ఓ పాడుబడ్డ వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి ఉంటుందని కుటుంబసభ్యులు తెలిపారు. కుమారుడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు మంగళవారం నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

గోపాల్‌పేట: వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన ఏదుల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుణమోని రేణుక, గుణమోని రాములు(40) భార్యాభర్తలు. మంగళవారం ఉదయం డబ్బుల విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రాములు పొలానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించేలోపు మరణించడంతో చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

జడ్చర్ల: విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని గోప్లాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కావేరమ్మపేటకు చెందిన వెంకటేశ్ యాదవ్ (45) టైల్స్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం గోప్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో టైల్స్ పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో టైల్స్ వేసేందుకు వినియోగించిన యంత్రం వైర్‌ను ప్లగ్ తీయకుండా చుడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్ యాదవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

వివాహిత బలవన్మరణం

లింగాల: ఆర్థిక ఇబ్బందులతో వివాహిత వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని చెన్నంపల్లికి చెందిన వల్లెపు సుజాత (43) మండల కేంద్రం సమీపంలోని అప్పాయపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న పెద్దవాగులో శవమై కనిపించింది. ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయిందని.. పెద్దవాగులో మృతదేహాన్ని గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె భర్త సలేశ్వరం పదేళ్ల కిందటే చనిపోగా.. అప్పులు చేసి పెద్దకుమార్తె పెళ్లి చేసిందని, పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలి, రెండో కుమార్తె పెళ్లి ఎలా చేయాలనే బెంగతో ఆత్మహత్య చేసుకొని ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య


సువర్ణ (ఫైల్)

కొత్తకోట రూరల్: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అప్పరాలలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ కథనం మేరకు.. మండలంలోని పాలెం గ్రామానికి చెందిన సువర్ణకు అప్పరాలకు చెందిన సందెపాగ రవితో 22 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉండగా.. ఇటీవల కుమార్తె వివాహం చేశారు. గత కొన్నేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా ఓమారు సువర్ణ తల్లిగారింటికి వెళ్లింది. పెద్దమనుషులు ఆనంద్‌ను మందలించి సువర్ణను పంపించారు. ఈ నెల 8న గొడవ పడగా పురుగుమందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే వనపర్తి ఏరియా ఆసుపత్రికి, అటు నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. అన్న మూలింటి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శాంతినగర్ : తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ కొడుకు మృతి చెందిన ఘటన స్థానిక రాఘవేంద్ర కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్ రాఘవేంద్ర కాలనీలో ఉండే అమర్నాథ్ (53) తండ్రి గత నెలలో మరణించాడు. తండ్రి మరణాన్ని తట్టుకోలేక అమర్నాథ్ గత నెల 29న రాత్రి పొలం వద్ద గడ్డి మందు తాగి కూతురుకు ఫోన్‌చేసి విషయాన్ని చెప్పాడు. హుటాహుటిన పొలం వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

టీజీపీఈసెట్‌కు సర్వం సిద్ధం


పీయూ గ్రౌండ్ బాల్ బ్యాడ్మింటన్ కోర్ట్‌ను పరిశీలిస్తున్న వీసీ శ్రీనివాస్, సెట్ కన్వీనర్ దిలీప్

- నేటినుంచి పీయూలో పరీక్ష ఈవెంట్స్ నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా హాజరుకానున్న 2, 561 మంది విద్యార్థులు
- ప్రారంభించనున్న హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి
- పీయూలో ఏర్పాట్లను పరిశీలించిన వీసీ శ్రీనివాస్, సెట్ కన్వీనర్ దిలీప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా డీపెడ్, బీపెడ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న టీజీపీఈసెట్–2025 అర్హత పరీక్షకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి మూడు రోజుల పాటు పాలమూరు యూనివర్సిటీలో పరీక్షకు సంబంధించిన ఈవెంట్స్ నిర్వహించేందుకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నిజిల్లాల నుంచి మొత్తం 2, 561 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈవెంట్స్‌ను బుధవారం ఉదయం 11గంటలకు రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి ప్రారంభించనున్నారు. ఉదయం అర్హత పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు రాత్రి పీయూకు చేరుకోనున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. బాలుర, బాలికలకు వేర్వేరు హాస్టల్స్‌లో వసతి ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను మంగళవారం పీయూ వీసీ శ్రీనివాస్, కన్వీనర్ దిలీప్ పీయూలోని సింథటిక్ ట్రాక్, పీజీ కళాశాల గ్రౌండ్, ఇండోర్ స్టేడియం పరిశీలించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



టీజీపీఈసెట్ పరీక్ష నిర్వహణకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశాం. ఈవెంట్స్ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పీయూలో అథ్లెటిక్స్‌కి సింథటిక్స్ ట్రాక్ గ్రౌండ్, సాధారణ క్రీడలకు పీజీ కళాశాల గ్రౌండ్‌లో 11 కోర్ట్‌లను ఏర్పాటు చేశాం. ఇతర జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థులకు రాత్రికి ఉండేందుకు వివిధ హాస్టల్స్‌లో వసతి కల్పించాం. ఇప్పటికే హాల్‌టికెట్‌లను అభ్యర్థులకు జారీ చేశాం. అందులో సూచించిన తేదీలు, సమయం ఆధారంగా ఈవెంట్స్‌కు విద్యార్థులు రావాలి.

– దిలీప్, టీజీపీఈసెట్ కన్వీనర్

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

ఈవెంట్స్‌కు హాజరయ్యే విద్యార్థులు తప్పకుండా బాలురు 100 మీటర్లు, 800 మీటర్లు రన్నింగ్, షార్ట్‌పుట్ 6 కేజీలు, లాంగ్‌జంప్ లేదా హైజంప్‌లో పాల్గొనాల్సి ఉంది. ఇక బాలికలకు సంబంధించి 100 మీటర్లు, 400 మీటర్లు, షార్ట్‌పుట్ 4 కేజీలు లాంగ్‌జంప్ లేదా హైజంప్‌లో పాల్గొనాలి. వీటికి సంబంధించి ఏర్పాట్లను ఇటీవల నిర్మించిన సింథటిక్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. ఇక ఆప్షన్ కింద విద్యార్థులు ఎంచుకునేందుకు ఉన్న గేమ్స్‌లో మొత్తం 11కోర్ట్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో కబడ్డీ 5 కోర్ట్‌లు, వాలీబాల్ 3, లాన్ టెన్నీస్ 1, ఖోఖో 3, బాస్కెట్‌బాల్ 1, బ్యాట్‌మెంటన్ 3, బాల్ బ్యాట్‌మెంటన్ 1, హ్యాండ్‌బాల్ 1, హాకీ 1, ఫుట్‌బాల్ 1, క్రికెట్‌లు 2 నెట్‌లను ఏర్పాటు చేశారు. మొదటిరోజు ఈవెంట్స్‌కు 760 మంది విద్యార్థులు హాజరుకాన్నునారు.


మంగళవారం సాయంత్రానికి పీయూకు చేరుకున్న ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు

ఎండీసీఏ మైదానాన్ని అభివృద్ధి చేస్తాం


అండర్–23 లీగ్ విన్నర్ మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న హెచ్‌సీఏ, ఎండీసీఏ ప్రతినిధులు

- హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బస్వరాజు
- ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ విన్నర్ జట్లకు ట్రోఫీలు ప్రదానం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎండీసీఏ మైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బస్వరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ఇటీవల నిర్వహించిన ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలతో పాటు వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బస్వరాజు మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో పెద్ద క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏకు హైదరాబాద్ తర్వాత తెలంగాణలో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో క్రికెట్ మైదానాలు ఉన్నట్లు తెలిపారు. మహిళలు క్రికెట్‌లో పాల్గొంటుండడం సంతోషంగా ఉందన్నారు. క్రికెట్‌లో ప్రతిభ కనబరిచే మహిళలకు రైల్వేస్ ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. చదువుతో పాటు క్రికెట్ ఆడాలని కోరారు. ఇక్కడి మైదానంలో బీసీసీఐ మహిళ మ్యాచ్ పెడుతామని అన్నారు. జిల్లాలో రెండు క్రికెట్ అకాడమీలు లేదా 10 ఎకరాల్లో మరో క్రికెట్ స్టేడియం ఉండాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అపెక్స్ సమావేశంలో కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ మైదానాన్ని అభివృద్ధి చేయడం తమవంతు బాధ్యత అని అన్నారు. ఈ మైదానంలో బీసీసీఐ, త్రీడే, టూడే లీగ్ మ్యాచ్‌లు జరిపిస్తామని అన్నారు. బీపీఎల్ కింద ఉన్న వారికి ఉచిత క్రికెట్ శిక్షణ అందజేస్తామన్నారు. హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జిత్‌సింగ్ మాట్లాడుతూ మైదానంలో అండర్–16 మ్యాచ్ నిర్వహిస్తామని అన్నారు. క్రికెట్‌లో క్రీడాకారులు ప్రతిభ కనబరచాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌లో మొదటిసారిగా ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లు నిర్వహించడం సంతోషంగా ఉందని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో అండర్–23 టూడే లీగ్, 19తో పాటు మహబూబ్‌నగర్‌లో ఇంట్రా డిస్ట్రిక్ట్ క్రికెట్ లీగ్‌లను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. నిరుపేద క్రీడాకారులను గుర్తించి వారికి ఎండీసీఏ తరపున విద్యతోపాటు క్రికెట్‌లో కోచింగ్ అందజేస్తామని చెప్పారు. అనంతరం అండర్–23, అండర్–19 విభాగాల విన్నర్ జట్లు మహబూబ్‌నగర్, ఉమెన్స్ క్రికెట్ లీగ్ రెడ్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, వెంకటరామారావు, హెచ్‌సీఏ సభ్యులు శంకర్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, మన్నాన్, సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, ఆబెద్ హుస్సేన్, మహేష్, రంజిత్‌కుమార్, శంకర్ పాల్గొన్నారు.

ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్‌లో ఉత్తమ ప్రతిభ క్రీడాకారులు

అండర్–23 విభాగంలో ఉత్తమ బ్యాట్స్‌మెన్ కేతన్‌కుమార్–జడ్చర్ల (473 పరుగులు), ఉత్తమ బౌలర్ ముఖితుద్దీన్–మహబూబ్‌నగర్ (33 వికెట్లు), అండర్–19లో ఉత్తమ బ్యాట్స్‌మెన్ అబ్దుల్ రాఫే–మహబూబ్‌నగర్ (495 పరుగులు), ఉత్తమ బౌలర్ జశ్వంత్–నాగర్‌కర్నూల్ (11 వికెట్లు), ఉమెన్స్ లీగ్‌లో ఉత్తమ బౌలర్ దివ్యరాథోడ్ (7 వికెట్లు), ఉత్తమ ఆల్‌రౌండర్ అనిత (59 పరుగులు, 4 వికెట్లు).


ఉమెన్స్ లీగ్ విజేత రెడ్ జట్టు

చివరి లీగ్‌లో రెడ్‌దే విజయం

జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో మంగళవారం జరిగిన అండర్–25 ఉమెన్స్ క్రికెట్ లీగ్‌లో రెడ్ జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకొని చాంపియన్‌గా నిలిచింది. 6 వికెట్ల తేడాతో పింక్ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన పింక్ జట్టు 25 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రెడ్ జట్టు 20.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసి గెలుపొందింది. జట్టులో ప్రతీక 64 బంతుల్లో 8 ఫోర్లతో అజేయంగా 68 పరుగులు చేసి విజయంలో కీలకపాత్ర పోషించింది.

కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం


నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

ఏపీ ప్రభుత్వ తీరుపై నాగర్‌కర్నూల్‌లో జర్నలిస్టుల నిరసన

నాగర్‌కర్నూల్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా కేసు పెట్టి జైలుకు తరలించడం అప్రజాస్వామికమైన చర్య అని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని చెప్పారు. జర్నలిజంలో 50 ఏళ్ల అపార అనుభవం ఉన్న కొమ్మినేనిని అన్యాయంగా అరెస్ట్ చేసి జైలులో పెట్టారని మండిపడ్డారు. టీవీ డిబేట్‌లో మాట్లాడే విశ్లేషకుల వ్యాఖ్యలను జర్నలిస్టులకు, మీడియా సంస్థలకు ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు. పాత్రికేసులపై ఏదైనా చర్యలు తీసుకునేందుకు చట్టబద్ధ సంస్థలు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉంటుందని, అక్రమ కేసులతో జైలులో పెట్టడం దుర్మార్గమైన చర్య అని ఆక్షేపించారు. రాజకీయ కక్షలో భాగంగానే జర్నలిస్టులపై కేసులు, అరెస్టులకు పాల్పడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాదం వెంకటేశ్, కందికొండ మోహన్, బాదం పరమేశ్, కాణాపురం ప్రదీప్, శ్రీనుబాబు, మల్లేశ్, రామ్‌లక్ష్మణ్, వినయ్, శ్రీశైలం, సాధిక్ పాషా, పిన్నంశెట్టి సైదులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు సరికాదు..



సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అప్రజాస్వామికం. రాజకీయ పార్టీలు జర్నలిస్టుల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరించవద్దు. పార్టీలు ఐదేళ్ల పాలన కోసం వచ్చి జర్నలిస్టులను వేధించడం సరికాదు. రెడ్‌బుక్ రాజ్యాంగం అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు నుంచి తప్పించుకొని ప్రజల దృష్టిని మరల్చేందుకు ఏపీ ప్రభుత్వం చేస్తున్న కుటిల యత్నాలను అందరూ గమనిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం మంచిది కాదు. కొమ్మినేని అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా. – వినోద్‌కుమార్, న్యాయవాది, మహబూబ్‌నగర్

కోనేరులో దూకి వ్యక్తి బలవన్మరణం


పరశురాం (ఫైల్)

మాగనూర్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ మన్నన్ కథనం ప్రకారం .. మాగనూర్‌కు చెందిన వాకిటి పరశురాం(39) అదే గ్రామానికి చెందిన ముత్యమ్మతో 13 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే ఈ మధ్యకాలంలో పరశురాం తాగుడుకు బానిసై భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి 10 గంటల సమయంలో తాగిన మైకంలో భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు అతడి కోసం వెతకగా ఎక్కడా కనిపించకపోవడంతో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కోనేరులో పరశురాం మృతదేహం గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పరశురాం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నల్లమల అభయారణ్యంలో చిరుత


నల్లమలలోని సికార్ ఘర్ సమీపంలో చిరుత పులి

మన్ననూర్: నల్లమలలోని అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో సఫారీ ప్రయాణికులకు మంగళవారం చిరుత పులి కనిపించింది. నిజాం బంగ్లా (సికార్‌ఘర్) సమీపంలోని కొత్త రోడ్డు నుంచి చిరుత నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లడాన్ని సఫారీ వాహనం డ్రైవర్ గమనించి పర్యాటకులకు తెలియజేశారు. దీంతో సెల్‌ఫోన్లలో చిరుతను చిత్రీకరించుకున్నారు. అభయారణ్యంలో అతి సమీపంగా చిరుత పులి కనించడంతో సఫారీ పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు.

సంజీవగుట్టపై చిరుత సంచారం


సంజీవ గుట్టపై కనిపిస్తున్న చిరుత

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ శివారు సంజీవ గుట్టపై మంగళవారం చిరుత సంచరించింది. దీంతో అటు వైపు రైతులు, గ్రామస్తులు వెళ్లాలంటనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సంజీవ గుట్టపై గత ఐదేళ్ల నుంచి చిరుత సంచరించడంతో పశువులను బలి తీసుకుందని రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

పెరిగిన ఇన్‌ఫ్లో.. విద్యుదుత్పత్తి ప్రారంభం

ధరూరు/దోమలపెంట/దేవరకద్ర: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. మంగళవారం 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో జలవిద్యుత్ కేంద్రంలో 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి తిరిగి ప్రారంభించారు. ఇందుకోసం 15,561 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 1,500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 91 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 17,467 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.730 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల ఎగువ కేంద్రంలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు 14.371 మిలియన్ యూనిట్లు, దిగువలో 3 యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు 15.646 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఇప్పటివరకు 30.017 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

- శ్రీశైలం జలాశయానికి 15,561 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 835.5 అడుగుల వద్ద 55.7729 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్‌కేంద్రంలో 1.669 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 3,605 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.768 మి.యూనిట్లు ఉత్పత్తి చేసి 1,583 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.

- కోయిల్‌సాగర్ నీటి మట్టం రోజురోజుకు కాస్త పెరుగుతోంది. ఉంద్యాల, తీలేర్ పంప్ హౌస్‌లను నుంచి ఒక్కొక్క మోటార్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కోయిల్‌సాగర్‌లో మంగళవారం సాయంత్రానికి 12.9 అడుగుల మేర నీరు చేరింది.

యథేచ్ఛగా ఇసుక దందా

- రాత్రిపూట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డంపింగ్
- పట్టపగలు దర్జాగా పొక్లెయిన్లు, టిప్పర్లతో రవాణా
- వాహనాలను పట్టుకొని వదిలేసిన పోలీసులు


పొక్లెయిన్‌తో టిప్పర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

కోస్గి: కొన్నిరోజులుగా కోస్గి పట్టణం అక్రమ ఇసుక దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పట్టణంలోని బహార్‌పేట, సాయినగర్ కాలనీ, చెన్నారం రోడ్డు, సబ్ స్టేషన్ ప్రాంతాల్లో రాత్రి పూట ఇసుకను డంపింగ్ చేసి పగలు జేసీబీలతో టిప్పర్ల ద్వారా బహిరంగంగా విక్రయిస్తున్నారు. మంగళవారం ఉదయం బహార్‌పేటలోని మహబూబ్‌నగర్–తాండూర్ ప్రధాన రహదారి పక్కనే నిల్వ చేసిన డంప్ నుంచి జేసీబీ, టిప్పర్ నుంచి ఇసుకను తరలిస్తున్నారు. గతకొన్ని రోజులుగా సాగుతున్న ఈ వ్యవహారంపై అటుగా వెళ్తున్న కొందరు యువకులు ప్రశ్నించగా హైదరాబాద్ వరకు అమ్ముకునేదుకు జీహెచ్ఎంసీ నుంచి అనుమతులున్నాయని, అపడానికి మీరెవరంటూ ఇసుక మాఫీయా ఎదురు తిరగడంతో యువకులు స్థానిక విలేకర్లు, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పట్టుకొని వదిలేసిన పోలీసులు

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. వాహనాలను స్టేషన్‌కు తరలించకుండా టిప్పర్ నుంచి ఇసుకను ఖాళీ చేయించి వాహనాలను వదిలేశారు. ఓ పక్క రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణా విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలిస్తుండగా.. ఏకంగా ముఖ్యమంత్రి సొంత ఇలాఖాలోనే ఇసుక అక్రమ దందా జోరుగా కొనసాగుతుంది. అక్రమ రవాణాను నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో హద్దూ అదుపు లేకుండా పట్టపగలే జేసీబీలు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ ఇసుక మాఫీయా అందినంతా దండుకుంటుంది. అక్రమ దందాను అడ్డుకునేందుకు ఫిర్యాదు చేస్తే పోలీసులు వచ్చి వాహనాలను వదిలేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.


ఇసుక డంప్ దగ్గర లోడ్ చేసిన టిప్పర్

అనుమతులు ఉన్నాయని వదిలేశాం



బహార్‌పేటలో జేసీబీతో ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేస్తున్న విషయంలో సమాచారం రాగానే ఘటనా స్థలానికి సిబ్బందిని పంపించా. అనుమతి తీసుకొని మాగనూర్ నుంచి తెచ్చి ఇక్కడ నిల్వ చేసినట్లు రశీదులు చూపించారు. రవాణా చేయడం కుదరదని టిప్పర్‌లో లోడ్ చేసిన ఇసుకను ఖాళీ చేయించి జేసీబీ, టిప్పర్‌ను వదిలేశాం.

– బాలరాజు, ఎస్సై, కోస్గి